

సత్యవేడు మండలం చెన్నేరిలో గ్రావెల్ తవ్వకాలు

సమీపంలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలు

చెలరేగుతున్న మట్టి మాఫియా

- చెన్నేరి గిరిజన భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- నాలుగేళ్ల క్రితం పొందిన అనుమతులతో కొనసాగింపు

సత్యవేడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇష్టానుసారం సాగిన గ్రావెల్ తవ్వకాలకు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బ్రేక్ పడినట్లే కనిపించింది. మళ్లీ కొన్ని రోజులుగా కోరలు చాస్తోంది. సత్యవేడు మండలం దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి గ్రామం జగనన్న లే అవుట్‌కు అతి సమీపంలోని సర్వే నెం.82, 83లలోని 2.420 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాల కోసం 2022లో చెన్నైకు చెందిన ఓ బడా వ్యక్తి ఐదేళ్ల కాల పరిమితికి అనుమతులు పొందాడు. అయితే అనుమతులు ఇచ్చే ముందు అధికారులు కనీస నిబంధనలు సూచించకపోవడం వివాదానికి దారితీసింది. చుట్టూ నివాస గృహాలున్నా ఖాళీ ప్రాంతంగా చూపిస్తూ గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చేశారు. నివాస గృహాలకు దగ్గరలో చేపట్టే గ్రావెల్ తవ్వకాలతో తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని చెన్నేరి గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తవ్వకాలు ఆపాలని పలుమార్లు ఆందోళనకు దిగారు. వైసీపీ నేతల అండదండలతో సదరు కాంట్రాక్టరు గ్రామస్తులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తవ్వి తరలించారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పది నెలలుగా తవ్వకాలకు బ్రేక్ పడింది. అయితే రెండు వారాలుగా అదే ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లతో తవ్వి.. టిప్పర్లతో రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. అయినా, అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలున్నాయి.



చెదురుపాకంలోనూ మట్టి దందా

వరదయ్యపాళెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం చెదురుపాకం పంచాయతీలోని సర్వే నెం.32లో ఉన్న చెరువులో ఐదువేల క్యూబిక్ మీటర్ల మేర అనుమతులు పొందారు. అయితే అక్కడ గ్రావెల్ లేదనే కారణం చూపి జగనన్న కాలనీ సమీపంలో సర్వే నెం.307లో టిప్పర్ల సాయంతో తవ్వకాలు చేస్తున్నారు. అదే సమయంలో తమిళనాడుకు చెందిన కొందరు రైల్వే పనులకు అనుమతులు తెచ్చుకున్నామని చెప్పి జగనన్న కాలనీ సమీపంలో 308, 307 సర్వే నెంబర్ల వద్ద ఎక్స్‌కవేటర్ల సాయంతో సుమారు 30 టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు. గతంలో అనుమతులు లేకపోయినా సర్వే నెం.32లోని చెరువు మట్టిని వైసీపీ నాయకులు తరలించారు.ఎక్కడో అనుమతులు పొంది డీకేటీ భూముల్లో ప్రజలకు డబ్బు ఆశ చూపించి మట్టిని అక్రమార్కులు తరలించుకుపోతున్నారన్న విమర్శలున్నాయి.

వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ పెంపు

- యూజీ విద్యార్థులకు రూ.10,500, పీజీకి 13,500, పీహెచ్‌డీకి రూ.15వేలు

తిరుపతిరూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని వెటర్నరీ కళాశాలలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు స్టైఫండ్ పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2013 నవంబరు నాటికి ఫిక్స్ చేసిన స్టైఫండ్‌ని సవరిస్తూ జీవో జారీ అయింది. ఇప్పటివరకూ ఇంటర్న్‌షిప్ కాలంలో యూజీ విద్యార్థులకు నెలకు రూ.7వేలు అందిస్తుండగా..దాన్ని రూ.10,500కు పెంచారు. పీజీ విద్యార్థులకు రూ.9వేల నుంచి రూ.13,500కు, పీహెచ్‌డీ వారికి రూ.10వేలనుంచి రూ.15వేలకు పెంచారు. కాగా, స్టైఫండ్ పెంచాలని కోరుతూ వర్సిటీపరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫిబ్రవరి 3 నుంచి 44రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. విద్యార్థుల సమ్మె.. వారి డిమాండ్‌ను ఇటీవల ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చించారు. ఈ క్రమంలో స్టైఫండ్‌ని ప్రభుత్వం పెంచింది. వైద్యవిద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ ఇవ్వాలని, అరకొరగా పెంచిన స్టైఫండ్‌తో సంతృప్తికరంగా లేమని విద్యార్థులు అంటున్నారు. తమ డిమాండు మేరకు స్టైఫండ్ పెంచేవరకు సమ్మె కొనసాగిస్తామని చెబుతున్నారు.



తిరుమలలోని డీ టైప్ క్వార్టర్స్ వద్ద మద్యం మత్తులో వీరంగం చేస్తున్న యువకులు

తిరుమలలో మద్యం మత్తులో
యువకుల వీరంగం

- దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి
- ఆటోమొబైల్ వాహనం అద్దాలు ధ్వంసం

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు తిరుమలలో వీరంగం సృష్టించారు. దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి చేయడంతో పాటు వాహనాలనూ అడ్డుకుని భక్తులను హడలెత్తించారు. శ్రీకాంత్, కోటి అనే ఇద్దరు అన్నదమ్ములు పూటుగా మద్యం తాగి సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుమలలోని డీటైప్ క్వార్టర్స్ వద్దకు చేరుకున్నారు. మద్యం మత్తులో బిగ్గరగా కేకలు వేస్తూ రోడ్డుపై వెళ్లే వాహనాలకు అడ్డుపడ్డారు. ఆ సమయంలో దారిన వెళ్లే ముగ్గురు భవన నిర్మాణ కార్మికులపై దాడికి దిగారు. యువకుల చేష్టలకు భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. షర్టు కూడా లేకుండా రక్తగాయాలతో ఉన్న వారిని చూసి కొందరు భయంతో తమ వాహనాలను వెనుక్కు తిప్పుకొని వెళ్లాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న విజిలెన్స్ పోలీసు అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని యువకులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మద్యం మత్తులో ఉన్నవారిని ఏమాత్రం అదుపుచేయడం సాధ్యం కాలేదు. అదనపు సిబ్బంది వచ్చి బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అయినప్పటికీ వెకిలి నవ్వులు, అరుపులతో వీరంగం చేశారు.వారిని తరలించేందుకు వచ్చిన ఆటోమొబైల్ వాహనాల అద్దాలను కూడా ధ్వంసం చేశారు. ఈక్రమంలో అద్దం ముక్కలు తగిలి ఓ విజిలెన్స్ ఏవీఎస్వో చేతికి చిన్నపాటి రక్తగాయాలయ్యాయి. సుమారు 40 నిమిషాల తర్వాత వారిని బలవంతంగా తిరుపతికి తరలించాల్సి వచ్చింది. కాగా, మద్యం తాగిన ఆ ఇద్దరు పాతనేరస్తులని, గతంలో వీరు తిరుమలలో హాకర్లు ఉండేవారిని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పవిత్రతను దెబ్బతీస్తున్న
అనధికార వ్యక్తులు

ఉచిత భోజనం, వసతి సదుపాయాలకు తిరుమలలో కొదవ లేదు. ఈక్రమంలో చాలా మంది అనధికార వ్యక్తులు కొన్నేళ్లుగా ఇక్కడ తిష్టవేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు నామాలు పెట్టడం, దేవుని పటాలు, బొమ్మలు విక్రయిస్తూ రాత్రికి తిరుమలలోనే ఉండిపోతున్నారు. ఇలా తిరుమల కొండపై అనధికార వ్యక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. తిరుమల పవిత్రతకు విఘాతం కలిగించేలా రాత్రయితే మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. ఈనెల 13వ తేదీన కూడా కర్ణాటకకు చెందిన ఓ యువకుడు మద్యం తాగి మాడవీధుల్లోని అర్చకనిలయం సమీపంలో ఉన్న గ్యాలరీల్లో హల్‌చేసిన విషయం తెలిసిందే. ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పోలీసులకు కూడా మద్యం విక్రయిస్తానంటూ వీరంగం సృష్టించాడు. ఇదే క్రమంలో మరికొంతమంది కూడా తరుచూ భక్తులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్నారు. క్షేత్ర పవిత్రత, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు, భద్రతాధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.



పల్లె బస కార్యక్రమంలో ప్రజలతో కలసి సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

పల్లె బసకు పోలీసులు

- గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని.. నేరాల కట్టడి దిశగా అడుగులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు తగ్గించడానికి పోలీసు యంత్రాంగం వినూత్న ప్రణాళికలు సిద్ధం చేసింది. పల్లెలకు వెళ్లి ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని తొమ్మిది సబ్ డివిజన్ల నుంచి ప్రతి రోజూ ఒక డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది కలిసి వారివారి పరిధిలోని గ్రామాలను సందర్శించాలి. అక్కడే ప్రజలతో సహపంక్తి భోజనం చేసి.. రాత్రి బస చేసి.. మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి శ్రీకారం చేపట్టాలని ఆదేశించారు. ఇలా ప్రతి రోజూ ఒక గ్రామాన్ని ఎంచుకుని రాత్రి బస చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 గ్రామాల్లో పోలీసులు రాత్రి బస చేసి నేరాలు తగ్గుముఖం పట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ మంచి సంబంధాలు కలిగి ఉండి గ్రామంలో నేరస్థులు, వారి కదలికలను, గ్రామాలకు కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారం తెలుసుకుంటున్నారు. తద్వారా గ్రామాల్లో నేరాలు అరికట్టి శాంతి భద్రతల పరిరక్షణకు వీలుంటుందనే ఆలోచనకు శ్రీకారం చుట్టారు. అలాగే గ్రామాల్లో మధ్య వర్తులు, పెద్ద మనుషుల ప్రభావంపైనా దృష్టి పెడుతున్నారు. ఫిర్యాదుదారులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉన్నత స్థాయి అధికారులను కలిసే వాతావరణం కల్పిస్తున్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై ప్రజలతో మాట్లాడి అవగాహన కల్పిస్తున్నారు. మహిళలపై దాడులు జరుగుతున్న సమయంలో వాటిని ఎలా ఎదుర్కోవాలో దానిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. యువతీ యువకులు చెడు మార్గాల్లో వెళ్లకుండా ఉండేందుకు వారికి మత్తు పదార్థాలపై చైతన్యం కల్పిస్తున్నారు. పోలీసుల రాత్రి బసవల్ల గ్రామస్థుల మధ్య వివాదాలు తగ్గించి స్నేహభావంతో మెలిగే విధంగా సహాయ పడుతున్నారు.

నిరంతర కార్యక్రమం: ఎస్పీ

పోలీసులు ప్రజలతో కలసి గ్రామాల్లో ఉండటం వల్ల సత్సంబంధాలు మెరుగుపడతాయని ఎస్పీ హర్షవర్ధనరాజు అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 100 గ్రామాల్లో రాత్రి బస కార్యక్రమాలు చేయడం వల్ల ఎన్నో మంచి పనులు జరగడంతో పాటు ప్రజల్లో పోలీసులంటే ఒక మంచి భావన, సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం జరుగుతుందని, తద్వారా ప్రశాంత వాతావరణం ఏర్పడుతుందన్నారు. పోలీసులు నేరుగా ప్రజల చెంతకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో ఒక మంచి ఆలోచన, నమ్మకం కలుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

చెన్నై పరకామణిలో
టీటీడీ ఉద్యోగి చేతివాటం

- అధిక విలువైన డాలర్ల నోట్లను నొక్కేసిన సీనియర్ అసిస్టెంట్
- వాటి స్థానంలో తక్కువ విలువైన వాటిని చేర్చిన వైనం
- పోలీసులకు అధికారుల ఫిర్యాదు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): చెన్నై శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగే చేతివాటం ప్రదర్శించాడు. దాదాపు రూ.6.74 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ నోట్లను మాయం చేసినట్టు అధికారులు తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కృష్ణకుమార్ చెన్నై శ్రీవారి ఆలయం, సమాచార కేంద్రం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. గతేడాది అక్టోబరు 6వ తేదీన జరిగిన పరకామణి రిజిస్టర్‌లో కాలం సమస్య ఉందనే కారణంతో 950 విదేశీ కరెన్సీ నోట్లను నమోదు చేయలేదు. తిరిగి తర్వాత పరకామణి లెక్కింపు సమయంలో తిరిగి విదేశీ కరెన్సీ నోట్ల సంఖ్యను నమోదు చేశారు. అయితే గత పరకామణి లెక్కింపు జాబితాను, తాజా జాబితాను పోల్చిచూసినప్పుడు తేడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నిజానికి 950 నోట్లలో అధిక విలువైన డాలర్ నోట్లను మార్పిడి చేసి తక్కువ డాలర్ నోట్లను ఆస్థానంలో చేర్చినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. నోట్ల సంఖ్య కరెక్ట్‌గానే ఉన్నట్టు చూపించినప్పటికీ విలువను మాత్రం కృష్ణకుమార్ తన జేబులో వేసుకున్నట్టు విజిలెన్స్ అధికారులు ఫిబ్రవరి నెలలో జరిగిన విచారణలో గుర్తించారు. దాదాపు రూ.6.74 లక్షల కరెన్సీని చోరీ చేసినట్టు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈక్రమంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చెన్నై శ్రీవారి ఆలయ ఏఈవో పార్థసారథి ఇటీవల తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇప్పటికే కృష్ణకుమార్‌ను టీటీడీ సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

కోర్టు గడువు పూర్తి కాగానే
బుగ్గమఠం భూముల జాయింట్ సర్వే

- ఆక్రమణలను గుర్తించి స్వాధీనానికి చర్యలు
- రెవెన్యూ, దేవదాయ అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బుగ్గమఠం భూముల వ్యవహారంలో రాష్ట్ర హైకోర్టు నిర్దేశించిన గడువు పూర్తి కాగానే ఆ మఠం భూముల ఆక్రమణలు తేల్చేందుకు జాయింట్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారులను ఆదేశించారు. తిరుపతిలో బుగ్గ మఠానికి చెందిన అత్యంత ఖరీదైన 22 ఎకరాల భూములు కబ్జాకు గురి కావడం, అందులో కొంత భూమి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధీనంలో ఉన్న సంగతి తెలిసిందే. పెద్దిరెడ్డి ఆక్రమణలో వున్న భూములను స్వాధీనం చేయాలని మఠం అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు భూములపై హక్కులు నిరూపించే రికార్డులు, ఆధారాలు వుంటే సమర్పించేందుకు రెండు వారాల పాటు గడువు ఇచ్చింది. ఆ వ్యవధి ఈనెల 23వ తేదీన ముగియనున్న నేపథ్యంలో మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో రెవిన్యూ, దేవాదాయ శాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మఠం భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 23వ తేదీన హైకోర్టు ఇచ్చిన గడువు ముగియగానే రెవిన్యూ, దేవాదాయ శాఖలు సంయుక్తంగా మఠం భూములపై సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మఠానికి చెందిన మొత్తం 22 ఎకరాల భూములు ఎక్కడెక్కడ, ఏ స్థితిలో వున్నాయో తొలుత నిర్ధారించాలని ఆదేశించారు. అందులో కౌలుదార్ల ఆధీనంలో వున్న భూములను ప్రస్తుతానికి మినహాయించి ఇతరులు ఆక్రమించుకున్న భూములపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇతరుల కబ్జాకు గురైన భూములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావు లేదని, అలాగే ఎలాంటి ఒత్తిడులూ వుండవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల చేతుల్లోని మఠం భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాల్సిందేనని ఆదేశించారు. తిరుపతి సహా జిల్లాలోని అన్ని ఆలయాలు, మఠాలకు చెందిన భూములనూ పరిరక్షించుకునే దిశగా కఠిన చర్యలకు ఉపక్రమించాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా తిరుపతిలో భూముల విలువ అధికమని, ఖరీదైన దేవాదాయ శాఖ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై వుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, దేవాదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, బుగ్గమఠం ఈవో వెంకటేశ్వర్లు, తిరుపతి అర్బన్ తహసిల్దారు భాగ్యలక్ష్మి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ గోడౌన్ పరిశీలన

- పుత్తూరు మున్సిపాలిటీలో 2వ రోజు కొనసాగిన పునర్విచారణ

పుత్తూరు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో 2వ రోజు కమిటీ సభ్యులు పునః విచారణ కొనసాగించారు. మంగళవారం కార్యాలయంలోని 2019-24 మధ్య చేపట్టిన అభివృద్ధి పనులు, కొనుగోలు చేసిన వాహనాలు, పారిశుధ్య సామగ్రి తదితర ఫైళ్లను పరిశీలించారు. అంతే కాకుండా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గోడౌన్‌ను పరిశీలించారు. అందులోని పైప్‌లు, మోటర్లు, ఇతర సామగ్రిని వెలికితీయించారు. గత కమిటీ కార్యాలయానికే పరిమితమైందన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రస్తుత కమిటీ ఆధ్వర్యంలో ప్రతీదీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారనేందుకు క్షేత్రస్థాయి పరిశీలన ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:58 (గురువారం ఉదయం)

క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభతరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాకాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైద్య పరీక్షలు చేయించుకుని క్యాన్సర్ మొదటి దశలో గుర్తిస్తే చికిత్సతో నివారణ సాధ్యమని వైద్యులు సూచించారు. దామలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ వైద్యులు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటయ్యబాబు, రెడ్డికుమారి మాట్లాడుతూ ధూమపానం, మద్యపానంతో నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో బాట్ల, డాక్టర్ మోహతాజ్, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు విజయమోహన్ రెడ్డప్ప, సీఆర్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబం చిత్రకళ


కళాకారులకు పుష్పగుచ్ఛం అందస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు సం`స్కృతీ,సంప్రదాయాలు తెలియజేయడానికి చిత్రకళ ఎంతో అవసరమని మంచు విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంబీయూ ప్రోఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. మంగళవారం ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విష్ణు ఆర్ట్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ ఆర్ట్ కార్యక్రమాన్ని ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులు, కళాకారులు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ చిత్ర కళాకారులు పాల్గొన్నారు. కళాకారులు పలు చిత్రాలను గీసి, మోహన్‌బాబుకు, విష్ణులకు అందజేశారు. ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, డాక్టర్ నాగరాజ రామరావ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీఎఫ్ఎ రవిశేఖర్, ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణతో మహిళలకు మెరుగైన ఉపాధి

పాకాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలలో శిక్షణతో మహిళలు మెరుగైన ఉపాధి పొందవచ్చని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు. పాకాలలో మంగళవారం న్యూకాలనీ, భారతంమిట్ట, గాంధీనగర్‌లో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, నాయకులు బి.ఈశ్వరచౌదరి, డేవిడ్ సురేష్, డి.మోహన్‌నాయుడు, గౌతమి రమేష్, రావిళ్ల మోహన్ పాల్గొన్నారు.

హరేకృష్ణ శతపతికి రాష్ట్రీయ పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ మాజీ వీసీ హరేకృష్ణ శతపతి శ్రీభాష్యం పార్థసారథి రాష్ట్రీయ పురస్కారాన్ని పొందారు. సంస్కృత సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని సంస్కృత అకాడమీ ఈ పురస్కారాన్ని అందించింది.

చంద్రగిరి

చింతగుంట సచివాలయంపై దాడి


పగిలిన అద్దాలు

ఎర్రావారిపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చింతగుంట సచివాలయంపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. రాత్రి 11 గంటలకు కొందరు రాళ్లు విసరడంతో కార్యాలయం కిటికీ అద్దాలు పగిలిపోయాయి. సోమవారం సచివాలయ కార్యాదర్శి హేమలత ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకుంటామన్నారు.

నేడు ఎంబీయూ వార్షికోత్సవం

చంద్రగిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు విశ్వవిద్యాలయం 33వ వార్షికోత్సవంతో పాటు, సినీనటుడు ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్‌బాబు, ప్రోఛాన్సలర్ మంచు విష్ణులతో పాటు సహస్రావధాని మాడుగల నాగఫణి శర్మ, రాజ్యసభ మాజీ సభ్యుడు, సినీనటుడు శరత్‌కుమార్, సినీనటుడు,కొరియోగ్రాఫర్ ప్రభుదేవలు హాజరు కానున్నట్లు వర్సిటీ వీసీ కరుణాకరన్ తెలిపారు.

21న వారపు సంత వేలం

భాకరాపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ వారపు సంత వేలాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. దినసరి మార్కెట్, వారపు సంత, ప్రైవేటు వాహనాల నుంచి రుసుము వసూలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు వేలాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు దరావత్తు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

భాకరాపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రోడ్లు, గోకులం షెడ్లు, ఫారం పాండ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులు ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలన్నారు. పనుల ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. కూలీల సంఖ్య ఎక్కువగా ఉండేటట్లు చూడాలన్నారు. ఏపీవో భార్గవి, టీఏ రంజిత్‌కుమార్, జేఈ నగేశ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతుల కల్పన


శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఆర్‌సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, తదితరులు

తిరుపతి రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలోని శ్మశానవాటిక ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షణ చర్యలు చేపట్టి.. వసతుల కల్పనకు కృషి చేస్తామని డిప్యూటీ మేయర్లు ఆర్‌సీమునికృష్ణ, ముద్ర నారాయణ తెలిపారు. మంగళవారం ఎంఆర్‌పల్లెలో మన ఊరు-మన బాధ్యతకు నాంది పలుకుదాం కార్యక్రమంలో భాగంగా శ్మశానవాటికని సందర్శించారు. ఈసందర్భంగా జనసేనపార్టీ అధ్యక్షుడు, వన్నియకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అయ్యంగారు బాలసుబ్రమణ్యంతో పలువురు కూటమిపార్టీనేతలు కలసి స్మశానవాటిక సమస్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానాలపై విన్నవించారు. కార్పొరేటర్ ఎస్‌కే బాబు పాల్గొన్నారు.

వెటర్నరీ విద్యార్థుల నిరసన

తిరుపతి రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారమూ కొనసాగింది. దీనిలో భాగంగా వర్సిటీ ప్రధాగేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బెలూన్లపై స్టైఫండ్ ప్రాముఖ్యతని పొందుపరచి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. 44రోజులుగా నిరసన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని విద్యార్థులు వాపోయారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలి

తిరుపతిరూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పదవతరగతి విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని మరింతగా పెంచి జరుగుతున్న పబ్లిక్ పరీక్షలను బాగా రాసేలా వారిలో ప్రేరణ కలిగించాలని సమగ్రశిక్ష ఏఎస్‌వో సారథి, జీసీడీవో పుష్ప తెలిపారు. పద్మావతిపురంలోని ఎంపీపీస్కూల్‌లో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ ఛాలెంజస్ ఇన్ అడల్ట్ టెన్త్ స్టూడెంట్స్‌పై జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఎస్ఎస్‌టీచర్లకు మంగళవారం ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు పలు సూచనలు చేశారు.

యువతతోనే వేద పరిరక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేద పరిరక్షణకు యువత నడుం బిగించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. మూడు రోజులుగా వేద వర్సిటీలో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనంలో భాగంగా మంగళవారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేద విద్యార్థులు సనాతన ధర్మ పరిరక్షకులని అభిప్రాయపడ్డారు. అనంతరం చేపట్టిన హరినాథ్ బృందపు నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వీసీ రాణీసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు, ఉజ్జయిని సంస్థాన కార్యదర్శి విరూపాక్ష జడ్డిపాల్, కంచి వర్సిటీ వీసీ శ్రీనివాస్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ తారకరామకుమారశర్మ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

గండికోట సందర్శన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూ టూరిజం - సీప్ స్టడీస్ విభాగ పీజీ విద్యార్థులు ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట, ఒంటిమిట్ట, నందలూరు ప్రాంతాలను సందర్శించారు. ఈ ప్రాంతాల్లో మెరుగు పరచవలసిన అంశాలను వారు అధ్యయనం చేశారు. అధ్యాపకులు ప్రయాగ, పద్మజ, తిమ్మప్ప పాల్గొన్నారు.

వేలం వాయిదా వెనుక ఏమిటో మతలబు?

● పంచాయతీ అధికారుల తీరుపై విస్మయం


టూరిస్టు బస్టాండ్ పార్కింగ్ స్థలం

తిరుచానూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ అధికారుల తీరు విడ్డూరంగా ఉంది. సాధారణ అంశాన్ని సాకుగా చూపుతూ వేలం పాటను వాయిదా వేయడం విస్మయం కలిగిస్తోంది. తిరచానూరు గ్రామ పంచాయతీ టూరిస్టు బస్టాండు, షాపింగ్ కాంప్లెక్సుకు బుధవారం వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే వీఐపీ పర్యటన సందర్భంగా బందోబస్తు ఇవ్వలేమని పోలీసులు చెప్పారంటూ పంచాయతీ అధికారులు వేలం వాయిదా వేశారు. సీఎం 20న వస్తుంటే బుధవారం వేలంపాట వాయిదా వేయడమేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన పదేళ్లలో టూరిస్టు బస్టాండు వేలం పాట ప్రశాంతంగానే సాగుతోంది. ఏనాడూ గొడవలు జరగలేదు. అయితే శాంతిభద్రతల అంశాన్ని వేలానికి ముడిపెట్టడం వెనుక ఏదో మతలబు ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయతీకి భారీ గండి

టూరిస్టు బస్టాండు వేలం పాట ద్వారా ఏటా సుమారు రూ.3కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అయితే వివిధ పార్టీలకు చెందిన కొందరు క్షేత్రస్థాయి నేతలు టెండర్ దక్కించుకుని, సంపాదించుకుని పంచాయతీకి నగదు కట్టకుండా మస్కా కొడుతున్నారు. పంచాయితీకి చెందిన కొందరు కాసుల కక్కుర్తితో కాంట్రాక్టర్ల నుంచి డబ్బు వసులు చేయకుండా ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. 2018, 2019, 2021 సంవత్సరాలకు సంబంధించి పాటదారులు రూ.1.07కోట్ల మేర ఎగనామం పెట్టినట్లు సమాచారం. వారికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చిన దాఖలాలూ లేవు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ వేలం పాటను నిర్వహించాలని, పాటదారుల నుంచి బకాయిలు రాబట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా రామ్మూర్తి నాయుడి జయంతి


రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు

చంద్రగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు జయంతి వేడుకలను మంగళవారం నారావారిపల్లెలో ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు సతీమణి ఇందిరమ్మ, కుమారులు, గిరీష్, సినీనటుడు రోహిత్, ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి, అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వందమందికి పైగా రక్తదానం చేశారు. రక్తదాతలకు ధ్రువపత్రాలతో పాటు పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో శతావధాని మేడసాని మోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమేంబరధరరావు, సింగు సుధా, నిరంజన్‌నాయుడు, గిరినాయుడు, వెంకటపతినాయుడు, హేమాద్రినాయుడు, విజయసారథి, సుబ్రమణ్యంనాయుడు, ప్రశాంత్, ఉదయ్, నితీష్, శ్రీకాంత్‌చౌదరి, సంతానం, కార్యకర్తలు, ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు రవి, జ్యోత్స్న, భద్ర తదితరులు పాల్గొన్నారు.

హేమాంబరధరరావు నివాళి

రామ్మూర్తి నాయుడుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రామ్మూర్తి నాయుడి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు.


రామ్మూర్తి కుటుంబ సభ్యులతో హేమాంబరధరరావు

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలతో పాటు శ్రీరామనవమి ఉత్సవాలు ఏప్రిల్6 నుంచి 8వ తేదీ వరకు, తెప్పోత్సవాలు 10 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్చి 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 26న అంకురార్పణ, 27 ఉదయం 9.15 నుంచి 9.30 గంటల వరకు మేషలగ్నంలో ధ్వజారోహణం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 3న ఉదయం 9.15 గంటలకు రథోత్సవం, 7న రాత్రి 7 నుంచి 9.30 మధ్య సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. అర్చకులు, డిప్యూటీఈవో నాగరత్న, ఏఈవో రవి, ఇన్స్పెక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

మరింత చేరువగా అన్నమయ్య కీర్తనలు

● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): జనబాహుళ్యంలోకి మరింతగా అన్నమాచార్యుల కీర్తలను తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని టీటీడీ ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణశర్మను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు బెంగళూరు, చెన్నైలకు చెందిన గాయకులు, సంగీత దర్శకులతో ఈవో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నమాచార్యుల 32 వేల కీర్తనల్లో ఇప్పటివరకు 14,932 టీటీడీ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో 4.750 కీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్ట్ రికార్డు చేసిందన్నారు. 4,610 కీర్తనలను టీటీడీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిందన్నారు. మిగిలిన కీర్తనలను కూడా త్వరలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. మొదటిదశలో 290 సంకీర్తనలతో 29 సీడీలను పూర్తి చేయగా, రెండవదశలో ఇప్పటికే 210 కీర్తనలతో 21 సీడీలను రూపొందించారన్నారు. మరో 130 సంకీర్తనల సీడీలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ సంకీర్తనలను రాగం నియమాలకు కట్టుబడి లలితంగా, శాస్త్రీయంగా, జనరంజకంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఆర్వో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి ఆవరణలో రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని రుయాస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనక నరసారెడ్డి ఆస్పత్రిలోని వ్యాపార నిర్వాహకులకు సూచించారు. ఆస్పత్రిలోని వ్యాపార నిర్వాహకులతో ఆయన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల విషయంలో నాణ్యత ఉండాలన్నారు. ఎమ్మార్పీకే వస్తులు విక్రయించాలని సూచించారు. అద్దెకు సంబంధించి జీఎస్టీ మినహాయించాలని వ్యాపారులు ఆయన్ను కోరారు. అరకు వ్యాలీ పేరుతో ఏర్పాటు చేసిన గిరిజన స్టాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా టిఫిన్, భోజనాలు విక్రయిస్తుండడంతో తాము నష్టపోతున్నామని తెలియజేశారు. సమస్యలపై పరిశీలించి తగిన చర్యలు చేపడతామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుమలకు రానున్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల వరకు ఏఎస్ఎల్ నిర్వహించారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎలాంటి చిన్న పొరబాట్లూ జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక డాక్టర్లను నియమించాలని, అధునాతన లైఫ్ సపోర్టు అంబులెన్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, ఫైర్ అధికారి రమణయ్య, విమానాశ్రయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నార

టూరిజం కేంద్రం ప్రతిపాదనకు కదలిక

● స్థలాన్ని పరిశీలించిన అధికారులు



చంద్రగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణి డ్యామ్ వద్ద ఏపీ టూరిజానికి చెందిన స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. పర్యాటక కేంద్రం అభివృద్ధికి 1999లో డ్యామ్ వద్ద ఇరిగేషన్‌కు సంబంధించిన 6.70 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం పర్యాటకశాఖకు బదలాయించింది. తర్వాత పర్యాటక కేంద్రం ఏర్పాటు ప్రతిపాదన మరుగన పడింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కదలిక వచ్చింది. ఈక్రమంలో ఏపీ టూరిజం, ఇరిగేషన్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఇచ్చిన భూమి కాకుండా మొత్తం 10 ఎకరాలు గుర్తించారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. స్థల పరిశీలనకు వచ్చిన వారిలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ వేంకటేశ్వరప్రసాద్, ఫారెస్ట్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, టూరిజం డీఈఈ రాజు, డిప్యూటీ ఇన్స్‌స్పెక్టర్ సర్వేయర్ చంద్రబాబు, మండల సర్వేయర్ సురేష్, ఇరిగేషన్ జేఈ సుదీప్ తదితరులు ఉన్నారు.

సిద్ధప్ప కొండకు నిప్పు



రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామాపురం సిద్ధప్పకొండకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి నిప్పు పెట్టారు. అడవిలోని వృక్షాలే కాలి బూడిద అవుతున్నాయి. కొన్ని జంతువులు మామిడి తోటలు, చెరకుతోటల్లోకి వచ్చేశాయి. అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కోటిలింగేశ్వరస్వామి సేవలో శ్రీనివాసులునాయుడు



రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వరస్వామిని ఉమ్మడి రాష్ట్ర సాంకేతిక సలహాదారుడు సూరపనేని శ్రీనివాసులునాయుడు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు వారికి అమ్మవార్ల దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. పురోహితులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

తిరుపతిరూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): న్యూ బాలాజీకాలనీలోని ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాలలో గ్లోబల్ లాజిక్, స్టార్ హెల్త్‌సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 110మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఉష పేర్కొన్నారు. వీరిని విద్యార్థులను చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మెరుగైన వైద్యం అందిద్దాం

తిరుపతి(వైద్యం), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి స్విమ్స్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కలిసి కట్టుగా కృషి చేద్దామని స్విమ్స్ ఉద్యోగుల నూతన కార్యవర్గానికి స్విమ్స్ రిజిస్ట్రార్ ఎర్రంరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఎన్నికైన స్విమ్స్ ఉద్యోగుల నూతన కార్యవర్గం స్విమ్స్ ఆడిటోరియంలో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు బాబు సురేష్, రామమూర్తి, కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, సురేష్, శివయ్య, రూపా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లకు ఘన నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ లలిత కళల విభాగంలో ప్రఖ్యాత సంగీత విద్వాంసులు దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు ఘన నివాళి అర్పించారు. గరిమెళ్ల ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యూనివర్సిటీలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. సంగీత, సాహిత్య రంగాలకు గరిమెళ్ల చేసిన సేవలను లలిత కళల విభాగ అధ్యాపకురాలు గిరిజాశేషమాంబ కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తుడా రోడ్డు కబ్జాకు యత్నం?

అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది



నిర్మాణ పనులను అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

తిరుపతి అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మంగళం -శెట్టిపల్లి తుడామాస్టర్ ప్లాన్ రోడ్డు మిగులు భూమి దాదాపు ఎనిమిది సెంట్లను (దాదాపు కోటి విలువైనది) గుర్తుతెలియని వ్యక్తులు కబ్జాకు యత్నించారు. తిరుపతి అర్బన్ రెవెన్యూ సిబ్బంది నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మంగళం గ్రామం లెక్కదాఖలా సర్వేనెంబరు109/8-బీలో శెట్టిపల్లి రోడ్డుకు, రైల్వే స్థలానికి మధ్యలో దాదాపు 8సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. ఇది తుడా మాస్టర్ ప్లాన్ రోడ్డు పరిధిలో ఉందని రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. గత వైసీపీ హయాంలోనే భూకబ్జాదారులు ఈ స్థలంపై కన్నేసి చిన్నగది నిర్మించారు. కరెంటు సర్వీసు, ఇంటిపన్ను కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అప్పట్లో ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ పాత గది ఇప్పటికీ అలాగే ఉంది. అయితే పది రోజుల క్రితం గుర్తుతెలియని భూకబ్జాదారులు (మరోబృందం) అదే స్థలానికి రోడ్డుకు అంచున గోడ నిర్మాణం చేపడుతుంటే రెవెన్యూ సిబ్బంది అడ్డుకొన్నారు. తాజాగా మంగళవారం మళ్లీ గోడ నిర్మాణం చేపట్టారు. మరోసారి రెవెన్యూ సిబ్బంది అడ్డుకొన్నారు. ఈ విషయమై అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా కబ్జా విషయం తుడా అధికారులకు తెలియజేశామని పేర్కొన్నారు.

భూ కబ్జా పోలీసు అధికారిపై చర్యలు తీసుకోండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): దళితుల భూములు కబ్జా చేస్తున్న రైల్వే పోలీసు అధికారి ఆశీర్వాదంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీపీఐ, రిపబ్లికన్ పార్టీల నేతలు నాగరాజు, కందారపు మురళి, అంజయ్య, గోవిందయ్య కలెక్టర్ వెంక టేశ్వర్‌కు విజ్ఞప్తిచేశారు. మంగళవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకాల మండలం కుక్కలపల్లి దళిత గ్రామంలో ఆశీర్వాదం తన కుటుంబ సభ్యులు, రౌడీలతో కలిసి దళితుల భూముల్లో అక్రమంగా ప్రవేశిస్తున్నాడని పేర్కొన్నారు. దళితుల డీకేటీ భూములు అక్రమంగా కొనుగోలు చేశాడని అంతేగాక ఇతరుల భూముల్లోకి దారి ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడని తెలియజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

శెట్టిపల్లి భూముల సమస్యలపై...

ఏప్రిల్ 15వ తేదీ లోపు శెట్టిపల్లె లబ్ధిదారులకు స్థలాలు చూపెడుతామని అన్ని అనుమతులు పొందిన తరువాత అధికారిక పత్రాలు అందజేస్తామని కలెక్టర్ నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గోవిందస్వామి, శెట్టిపల్లి భూ పోరాట కమిటీ నాయకులు కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిపొందని అర్హులైన లబ్ధిదారుల నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి స్థలం కోసం దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంతవరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్స్‌లో లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులని తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీ ద్వారా (టిడ్కో హౌసింగ్, నవరత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డెయిరీ, తనపల్లి, వికృతమాల) సొంతంగా ఇల్లు నిర్మించుకున్న వారు అనర్హులని వివరించారు.

చెత్త నిల్వల తొలగింపు



ఆర్టీవో కార్యాలయం పక్కవీధిలో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

తిరుపతి అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం సప్తగిరి కాలనీలో చెత్తనిల్వలను ఎట్టకేలకు తొలగించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'అడుగడుగునా వ్యర్థాలే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన సచివాలయ కార్యదర్శులు జయశంకర్, లావణ్యలు చెత్త నిల్వలు, మట్టికుప్పలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. రోడ్డును శుభ్రం చేయించారు.

సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షణీయం

తిరుపతి (జీవకోన), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్య హక్కుల పరిరక్షణ, వైద్యవిధాన అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేదిక్ అండ్ హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌లో భాగంగా సవరణ బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టడం హర్షణీయమని మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా ఆయుర్వేద వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రాక్టీస్‌కు అవసరమైన మార్గదర్శకాలు లభిస్తాయన్నారు. ఆయుర్వేదంలో ప్రయోగాలు చేయడానికి ఈ బిల్లుఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. బిల్లులను త్వరలోనే గవర్నర్ ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ పొంది నిబంధనలు రూపొందేలా ప్రభుత్వం దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబుకు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు, బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన ఎమ్మెల్యేలకు అసోసియేషన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ రవికుమార్, సుందరవదన, జోష్ణ పాల్గొన్నారు.

సాధువుల పట్ల టీటీడీ అమానుషం

● భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి (జీవకోన), మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సాధువుల పట్ల టీటీడీ అమానుషంగా వ్యవహరించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముంతాజ్ హోటల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. సాధువులపై జరిగిన దాడిని వైసీపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయంలో నేడు పరకామణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నేడు పరకామణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 9:30 గంటలకు పరకామణి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆలయ ఈవో తెలిపారు.

మన చేతల్లోనే సర్వేక్షణ్ ర్యాంకు..!

కార్పొరేషన్ నిబంధనలు పాటిస్తే చాలు ● నగరంలో పర్యటిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్ బృందం

తిరుపతి- ఆంధ్రజ్యోతి: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తిరుపతి నగరం సుందరంగా సిద్ధమవుతోంది. ప్రభుత్వ, నగరపాలక సంస్థ, ప్రైవేట్ ఇళ్ల గోడలపైన దేవతామూర్తుల, కళాత్మక చిత్రాలు, స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తిరుపతి, పచ్చదనం -పరిశుభ్రత నినాదాలకు సంబంధించిన పెయింటింగులతో కొత్తకళ వచ్చింది. స్కూళ్లు, పార్కులు, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే అండర్‌బ్రిడ్జి, ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి, రామానుజ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు నుంచి అలిపిరి వరకు, ఎమ్మార్‌పల్లి ఆర్చి నుంచి బాలాజీ కాలనీ వరకు, టౌన్‌క్లబ్ నుంచి అలిపిరి వరకు అందమైన కలంకారీ బొమ్మలు కొలువుదీరాయి. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతన్నాయి. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటిస్తోంది. తిరుపతిని జాతీయ స్థాయిలో నిలిపేందుకు నగరసాలక సంస్థ, ప్రభుత్వ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. ప్రజలు కూడా ఇందుకు సహకరిస్తేనే సర్వేక్షణ్‌లో సింహస్థానం దక్కుతుంది.

● ప్రామాణికాలివే..

మెరుగైన పారిశుధ్యం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన లేకపోవడం, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, వాటి నిర్వహణ పనితీరు, సీనియర్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్, డాక్యుమెంటేషన్స్, చెత్త సద్వినియోగం వంటి వాటిని ప్రధాన ప్రామాణికంగా తీసుకుంటారు. బృందం పరిశీలనలో ఉన్నప్పుడు అమలవుతున్న తీరుపైనే మార్కులు ఉంటాయి.

నగరాన్ని మన ఇల్లుగా భావించాలి



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి వరుసలో నిలపాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ తిరుపతి నగరం మన ఇల్లు అనేభావన ఉండాలి. పతిరోజూ ఉదయం ఇంటింటికి వచ్చే నగరపాలక సిబ్బందికి తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలి. నగరంలో 200 చెత్తకుప్పలు ఉన్నట్టు గుర్తించాం. ఉదయం 7గంటలు లోపు వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. 300 టన్నుల చెత్తను తీసుకెళ్లే వాహన సామర్థ్యం ఉంది. కానీ రోజుకు 230 టన్నుల మాత్రమే చెత్త ఉత్పత్తి అవుతోంది. అందువల్ల చెత్తను తీసుకెళ్లేందుకు వాహన సమస్య లేదు. నగరంలో చెత్త కుప్పలు కనిపించకూడదు. నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. చెత్త వీధుల్లో పడేసేవారికీ జరిమానా విధిస్తాం.

- మౌర్య, కమిషనర్, తిరుపతి నగరపాలక సంస్థ

రుయాలో పారిశుధ్య చర్యలు ముమ్మరం



కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిన సిబ్బంది

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో అధికారులు ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలో డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిండి దుర్వాసన వస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో 'రుయాలో అధ్వానంగా పారిశుధ్యం' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మదుసూధన్, అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మలు ఆస్పత్రిలో పర్యటించి మురుగునీటితో నిండివున్న కాలువలను పరిశీలించారు. ఏ క్లాస్, ఎఫ్ఎమ్ వార్డుల వద్ద డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం చేరి మురుగునీరు వెళ్లేందుకు అడ్డంగా ఉండటంతో ఏపీఎంఐసీడీసీ ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టారు. డ్రైనేజీ నీటిని రోడ్లపైకి వదిలితే చర్యలు తప్పవని ఏ-క్లాస్ వద్ద ఉన్న క్యాంటీన్ నిర్వాహకులను హెచ్చరించారు.డ్రైనేజీ కాలువలను అన్నింటినీ శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ, సిబ్బంది చైతన్య, పవన్ పాల్గొన్నారు.

నేడు సాయిసుధలో ఉచిత బీఎండీ వైద్యం

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని సాయిసుధా ఆస్పత్రిలో బుధవారం ఉచిత బీఎండీ (ఎముకల సాంద్రత) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటాస్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా బీఎండీ వైద్య పరీక్షలతోపాటు అవసరమైన మందులను అందిస్తామని వివరించారు.

డాక్టరేట్ ప్రదానం



ఎస్.మాధవీలత

తిరుపతి(ఆటోనగర్) మార్చి18(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో 'ఫిలాసఫి ఇన్ స్టాటిస్టిక్స్' విభాగంలో పరిశోధనలు చేసిన ఎస్.మాధవీలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి ఎం.దామ్లా నాయక్ తెలిపారు. ఆమె ప్రొఫెసర్ డాక్టర్ బి.సరోజమ్మ పర్యవేక్షణలో 'అనాలసిస్ ఆఫ్ ఎయిర్ పొల్యూటెన్స్ డేటా యూజింగ్ డేటా మైనింగ్ టెక్నిక్స్ 'అనే అంశంపై పరిశోధనలు చేశారు.

నేడు విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం

తిరుపతి (జీవకోన), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత రాత పరీక్షల విజేతలైన 18 మంది విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని సంస్థ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఈ బహుమతి ప్రదానోత్సవానికి డాక్టర్ మేడసాని మోహన్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ చౌదరి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: TIRUPATI
O.S.No. 701 of 2021

Canara Bank (previously Syndicate Bank) Akkaram Palle road branch, Tirupathi, rep by its Branch Manager .....Plaintiff

Vs.

P. Ramesh, K. Mohanachari...Defendants

Suit summons to Defendants1 and 2

To,
1) P. Ramesh, S/o P.Amaraiah, D. No. 204/24/1A, Kotha Palli, Tirupati, Chittoor District. 2) K.Mohanachari, S/0 Kodandachari, D. No. 20-4-34/D/22, Kotha Palli, Chandrasekhar Reddy Colony, Tirupati, Chittoor District.
The Plaintiff filed the suit for recovery of amount Rs 68,010-00 against both of You (defendants). The above case is posted to 03-04-2025 at 10-30 A.M. in the above court for your appearance and raise objections if any either in person or through advocate otherwise the matter will be decided on the records available in the case.

Hearing Date: 03-04-2025
G.MADHUSUDHANA REDDY, M.A.B.L.,
Advocate for Plaintiff,
Cell No 09440934263.

IN THE COURT OF THE V TH ADDITIONAL JUNIOR CIVIL JUDGE: TIRUPATI
O.S.No. 25 of 2024

Canara Bank M.R. Palle Branch-1, Tirupathi, rep by its Branch Manager .... Plaintiff

M.S. Enterprises rep by its Prop T.Vamsi krishna ... Defendant

Vs.

Suit summons to Defendant

To,
M.S. Enterprises rep by its Prop T.Vamsi krishna, S/o T.Subramanyam, Plot No.145, 5th cross, Kesavayaanagunta, Tirupati, Tirupati District. The Plaintiff filed the suit for recovery of amount Rs 5,44,591-00 against You (defendant). The above case is posted to 17-04-2025 at 10-30 A.M. in the above court for your appearance and raise objections if any either in person or through advocate otherwise the matter will be decided on the records available in the case.
Hearing Date: 17-04-2025
G.MADHUSUDHANA REDDY, M.A.B.L.,
Advocate for Plaintiff,
Cell No 09440934263.



అన్నప్రసాదం ట్రస్టుకు విరాళంగా రూ.పది లక్షలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందిస్తున్న తిరుపతికి చెందిన కేపీస్పీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్


ఆరుగురు ఇరిగేషన్ డీఈలకు పదోన్నతిపై బదిలీలు

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఆరుగురు డీఈలను ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. పిచ్చాటూరు ఇరిగేషన్ డీఈ జి.రామచంద్ర మూర్తిని సోమశిల లింక్ కెనాల్ అండ్ స్వర్ణముఖి బ్యారేజీ నెల్లూరు డివిజన్1కు ఈఈగా బదిలీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు వెంకటగిరి డీఈ ఎం.బాబురెడ్డిని వెంకటగిరి ఇరిగేషన్‌కు.. టీజీపీ నాయుడుపేట డీఈ సి.సి.రాజశేఖర్‌రెడ్డిని సోమశిల ప్రాజెక్టు ఆత్మకూరు డివిజన్ 4కు.. టీజీపీ డిజైన్స్ విభాగం తిరుపతి డీఈ పి.చంద్రశేఖరయ్యను అదే ప్రాజెక్టులో క్వాలిటీ కంట్రోల్ శ్రీకాళహస్తి డివిజన్ 3కి.. టీజీపీ బీఎన్ కండ్రిగ డీఈ బి.పెంచలయ్యను అనంతపురంలోని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ డివిజన్‌కు.. సోమశిల లింక్ కెనాల్ స్వర్ణముఖి బ్యారేజీ గూడూరు డీఈ పావులూరి చంద్రమోహన్ గాలేరు-నగరి ప్రాజెక్టు జమ్మలమడుగు డివిజన్4కు ఈఈగా బదిలీ చేశారు. చిత్తూరు వాటర్ సప్లై డీఈ జేవీ శివారెడ్డి శ్రీకాళహస్తి ఈఈగా బదిలీ అయ్యారు.

భర్త, ప్రియురాలికి పదేళ్ల జైలు


రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని ప్రియురాలికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పాతవేపకుప్పం గ్రామానికి చెందిన మమత, గోపి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అయితే గోపి అదే గ్రామానికి చెందిన భారతితో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యతో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలో ఆమె 2018 ఫిబ్రవరి 19న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి ఎస్‌ఐ భాస్కర్ నాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఎస్‌ఐ సాదిక్ ఆలీ విచారణ వేగవంతం చేశారు. గోపి, భారతి చర్యల వల్ల మమత ఆత్మహత్యకు పాల్పడిందని న్యాయమూర్తి గురునాథ్ పేర్కొంటూ వారిద్దరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.84 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,824
తలనీలాలు సమర్పించినవారు: 25,674



శ్రీవారి ఆలయం ముందు పలచగా ఉన్న భక్తులు

రుయాలో చెట్ల కింద సేదతీరుతూ..

తిరుమలలో..

నిర్మానుష్యంగా తిరుపతిలోని బాలాజీ కాలనీ సర్కిల్

మార్చి.. అప్పుడే మాడ్చి

- నిప్పులు చెరుగుతున్న సూర్యుడు
- అల్లాడిపోతున్న ప్రజానీకం

ఈ ఏడాది సూరీడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మార్చిలోనే ప్రతాపం చాటుతున్నాడు. సాధారణంగా మేనెలలో 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరేది. అలాంటిది మంగళవారం ఆమేరకు చేరుకోవడంతో జిల్లా ప్రజానీకం బెంబేలెత్తుతున్నారు. తిరుమలేశుడి దర్శనానికి తిరుపతి చేరుకునే భక్తులు అల్లాడిపోతున్నారు. ఇక, తిరుపతిలో ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లపై జనసంచారం పలచగా ఉంటోంది. అమ్మకాలు సాగడంలేదని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాంగణంలోని చెట్లనీడలో సేదతీరుతూ కనిపిస్తున్నారు. రూయా, మెటర్నరీ వైద్యశాలల వద్ద రోగులు,వారి బంధువులు చెమటలు కక్కుతూ నీడకోసం వెంపర్లాడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు, చిరు వ్యాపారులకు గరుడవారధి గొడుగులా మారింది. మరోపక్క ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నాపెద్దా తక్షణ ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. ఇళ్లలో ఫ్రిజ్‌లున్నా సహజమైన చల్లదనం కోసం జనం కుండలపై ఆసక్తి చూపిస్తున్నారు. తిరుమల కొండ మీద భక్తులు ఎండవేడిమికి తాళలేక మాడవీధుల నుంచి నీడ కోసం పరుగులు తీస్తున్నారు.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

ఎండలతో జాగ్రత్త



వడదెబ్బ అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. వడదెబ్బ అవగాహన బ్యానర్లు, పోస్టర్లను మంగళవారం ఆయన తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండ నుంచి రక్షణగా టోపీ, గొడుగులు వంటివి వాడాలన్నారు. నీటితో పాటు పళ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించి.. సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు మధుబాబు, లావణ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరి మృతి



చెంగల్రాయులు (ఫైల్ ఫొటో)

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లెలో వడదెబ్బకు పూజారి చెంగల్రాయులు(65) మృతిచెందారు.మంగళవారం ఉదయం 10గంటలకు పొలం వద్దకు వెళ్లిన ఆయన.. మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి వచ్చారు. గుండెనొప్పిగా ఉందంటూ కుప్పకూలారు. 108 వాహనం ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. వడదెబ్బ వల్లే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అద్దెకు కారు తీసుకుని.. ఉడాయించిన ఘనుడు

- అరెస్టు చేసిన పోలీసులు
- మూడు కార్లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): అద్దెకు కారు తీసుకున్నాడు. ఐదు రోజులు తిరిగి.. ఆపై ఉడాయించాడు. చివరకు ఇతడిని మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిన్న మిరానికి చెందిన మహేష్ నూతన కుమార్.. నకిలీ ఆధార్ కార్డు చూపించి ఈనెల 11న తిరుపతిలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు కారును వాడుకున్న తర్వాత.. కర్నూలు జిల్లా దాటి తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ కారుకు ఉన్న జీపీఆర్ఎస్ వైర్లు తొలగించాడు. తన మొబైల్ ఫోన్ స్విచ్ఆఫ్ చేశాడు. దీనిపై బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాంకిషోర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ లోకేష్‌బాబు, సిబ్బంది కలిసి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. తిరుపతి జూ పార్కు రోడ్డులో వున్నట్లు గుగూల్ మ్యాప్ ద్వారా మంగళవారం గుర్తించి అతడిని అరెస్టు చేశారు. గతంలో జైపూర్, ఢిల్లీ ప్రాంతాల్లో జూమ్ కార్లు అద్దెకు తీసుకుని ఉడాయించినట్లు గుర్తించారు. ఇతడిపై కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాదు, చెన్నై, భీమవరం, ముంబై నగరాల్లో మొత్తం 24 కేసులు నమోదైనట్లు గుర్తించారు. గతంలో ఐదుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. నిందితుడి జైపూర్, ఢిల్లీ, తిరుపతికి చెందిన మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారి బదిలీ

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలలో తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా పనిచేస్తున్న జి.గుణభూషణ్ రెడ్డి బదిలీ అయ్యారు. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఆయన గతేడాది జనవరి 10వ తేదీన దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ అయి టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా నియమితులయ్యారు. తాజాగా ప్రభుత్వం ఆయనను టీటీడీ నుంచీ బదిలీ చేసి కర్నూలు జిల్లా బీజీ రైల్వే విభాగం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జరిమానా లేదా జైలుకు పంపండి

- నాటుసారా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశం



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అయా తహసీల్దార్లు నాటుసారా నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా లేదా జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నాటుసారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవోదయం 2.0' పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. జిల్లా ఎక్సైజ్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీ, అటవీ, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు మండల.. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచడానికి గ్రామసభలు నిర్వహించాలన్నారు. రాబోయే మూడు నెలల్లో తిరుపతిని నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి కృషి చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో నిందితులకు పునరావాసం కల్పించి పరివర్తన తీసుకొస్తామని ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ చెప్పారు. నేరస్థులపై పీడీయాక్ట్ పెట్టి సారా వృత్తి నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటామని ఏసీ శ్రీనివాసాచారి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్ భూసేకరణ పురోగతి పనులపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్‌గా అధికారులతో సమీక్షించారు.

తిరుమలలో సాధువుల ధర్నాపై పోలీసులు సీరియస్

- 118 మందిపై కేసులు నమోదు
- పునరావృతం కాకుండా చట్టాల కఠినతరానికి నిర్ణయం

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా సాధువులు ధర్నాకు దిగడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ముందస్తుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ఆలయ చట్టాలకు వ్యతిరేకంగా శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన 118 మందిపై బీఎన్ఎస్ ప్రివెంట్ అరెస్ట్ సెక్షన్ 151 కింద కేసులు నమోదు చేశారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలనే డిమాండ్‌తో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు సోమవారం శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ధర్నాలో పాల్గొన్న 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఆలయ చట్టాలను మరింత కఠినతరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు. భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఇకపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చోటుచేసుకునే అవకాశముందనే అంచనాతో ఆలయ చట్టాలను కఠినంగా అమలుచేయాలని భావిస్తున్నారు. కాగా, ఆదర్శంగా ఉండాల్సిన సాధువులే అల్లర్లు చేస్తే ఎలా? అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుమలలో నిరసనకు దిగడం అపచారమని సాధువులకు తెలియదా? అని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండలకేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఎండల తీవ్రత దృష్ట్యా ఒక గంట ముందే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్సు కళాశాల అధికారుల పర్యటన

శ్రీసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్సు కళాశాలకు చెందిన 17మంది సభ్యుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. మేజర్ సి.పి.సంగ్రా నేతృత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో విచ్చేశారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరో స్పేస్, డిఫెన్సు రంగాల్లో భాగస్వామ్యం గురించి వారికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. శ్రీసిటీ తర్వాత ఈ ప్రాంతంలో వచ్చిన మార్పులనూ తెలియజేశారు. శ్రీసిటీ పారిశ్రామిక విధానం, సులభతర వ్యాపారం, లాజిస్టిక్స్ సామర్థ్యం, సామాజిక వసతులు, భద్రత తదితర అంశాలపై ప్రతినిధి బృందం చర్చించింది. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, క్రమశిక్షణ అద్భుతమంటూ టీం లీడర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ పర్యటన కోఆర్డినేటర్లుగా మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఎండీ రవీంద్రసన్నారెడ్డి

భక్తుల రక్షణ కోసం..

- తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ప్రధాన ఉద్యానవనాల్లో నీడ కోసం సిల్వర్‌ఓక్ వృక్షాలను టీటీడీ 1980లో ఏర్పాటు చేసింది. వీటి కాలపరిమితి 30 ఏళ్లు. ప్రస్తుతం తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఈ వృక్షాలు చిన్నపాటి గాలులు, వర్షాలతో నేలకూలుతున్నాయి. ఇప్పటివరకు కూలినచెట్ల కారణంగా అనేక వాహనాలు, నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భక్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని జనసంచారంలో ఉండే కాలం చెల్లిన సిల్వర్‌ఓక్ చెట్లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఫారెస్ట్ విభాగాన్ని ఆదేశించారు. వీరు 839 కాలంచెల్లిన వృక్షాలను గుర్తించారు. కూలిపోయే స్థితిలో ఉన్నట్టు నిర్ధారించారు. వీటి కొమ్మలు, ఆకులు నిత్యం పడుతుండటంతో విశ్రాంతి భవనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన వీటి తొలగింపు పనులు.. మూడునెలల్లో పూర్తికానున్నాయి. వాటి స్థానంలో దాదాపు 40 రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లను నాటాలని ఫారెస్ట్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.



తిరుమలలో తొలగించిన సిల్వర్‌ఓక్ వృక్షాలు

పుత్తూరు వార్తలు

హత్య కేసులో నిందితుడికి రిమాండ్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తించిన అన్న కుమారుడిని హత మార్చిన కేసులో నిందితుడు బాబాయిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన ఈనెల 9న పుత్తూరు మండలం చిన్నరాజకుప్పంలో జరిగింది. మంగళవారం సీఐ సురేంద్రనాయుడు మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సుబ్బరాయుడు, వెంకటేష్ అన్నదమ్ములు. గ్రామంలో పక్కపక్క ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. సుబ్బరాయుడి కుమారుడు మణికంఠ. ఈ నెల 9న ఆదివారం చిన్నాన్నతో కలిసి ఆయన ఇంట్లోనే మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో చిన్నాన్న వెంకటేష్ రోకలితో మణికంఠ తలపై బలంగా మోదాడు. దీంతో మణికంఠకు తీవ్ర రక్తస్రావం కావడంతో భయపడి పారిపోయి తిరుపతిలోని బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ఈక్రమంలో మంగళవారం పుత్తూరుకు వస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అరెస్టు చేశారు. తరచూ మణికంఠ చిన్నాన్నతో గొడవ పడడమే కాకుండా హేళనగా మాట్లాడడం, చంపేస్తానని బెదిరించే వాడని విచారణలో వెల్లడించాడు. ఈక్రమంలో పూటుగా తాగి రోకలి తీసుకొచ్చిన మణికంఠను చూడగానే చంపేస్తాడన్న భయం వేయడం, ఆ రోకలి లాక్కుని మోదడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో భయపడి పారిపోయాడని చెప్పాడు. మణికంఠ తల్లి బొప్పరాజు చెంచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన సిబ్బందిని డీఎస్పీ రవికుమార్ అభినందించారు.

ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట

మీటర్ రీడింగ్ కార్మికుల ధర్నా


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పుత్తూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో సంస్కరణల వల్ల మీటర్ రీడింగ్ కార్మికుల బతుకులు రోడ్డు మీద పడకుండా ప్రత్యామ్నాయం చూపాలని ఏఐటీ యూసీ జిల్లా సభ్యుడు మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పుత్తూరు డీఈ కార్యాలయం ఎదుట మీటర్ రీడర్స్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఏఐటీయూసీ సంఘీభావంగా పాల్గొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... త్వరలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుండడంతో 15 ఏళ్లుగా విద్యుత్ సంస్థను ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్న తాము ఉపాధి కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్‌లో దాదాపు 40 మంది మీటర్ రీడింగ్ కార్మికులు ఉన్నారని, విద్యార్హతను బట్టి ఉద్యోగాలను కల్పించాలన్నారు. అనంతరం డీఈ కార్యాలయాధికారికి వినతిపత్రాన్ని అందించారు. బాబు, మోహన్‌ఆచారి, శివ, సుబ్రమణ్యం, సల్మాన్, వెంకటేష్, గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 22న జాబ్‌మేళా

పుత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక యువకులకు ఈనెల 22వ తేదీ శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే మేళాలో నాలుగు బహుళ జాతి సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. టెన్త్ నుంచి పీజీ పూర్తైన విద్యార్థులు హాజరు కావచ్చన్నారు.వివరాలకు నెం.6300954441, 9963561755లలో సంప్రదించవచ్చు.

రూ.2.10 లక్షల పొదుపు సొమ్ము స్వాహా

లబోదిబోమంటున్న సంఘం సభ్యులు

పుత్తూరు అర్బన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులోని ఝాన్సీ సంఘంలో సభ్యురాలు ఆయేషా రూ.2.10 లక్షల పొదుపు సొమ్మును సొంతానికి వినియోగించుకుంది. మూడు నెలలుగా చెల్లించక పోవడంతో బ్యాంకర్లు సభ్యులను ప్రశ్నించారు. దీంతో ఖంగుతున్న సభ్యులు ఆయేషాను ప్రశ్నించగా మిన్నకుండిపోయింది. ఆర్పీ రేఖ సహా సభ్యులు ఆయేషా ఇంటికి వెళ్లి గొడవకు దిగారు. వారం రోజులు గడువు కావాలని ఆయేషా కోరింది.

పీజీఆర్‌ఎస్ సమయంలో మార్పు

పుత్తూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం చేపడుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం సమయంలో మార్పులు జరిగినట్టు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. వేసవిలో ఫిర్యాదుదారుల సౌకర్యార్థం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రజలు గమనించాలని కోరారు.

అంబరాన్నంటిన నేతన్నల సంబరాలు


అంబేద్కర్ కూడలి వద్ద సంబరాల్లో మరమగ్గ, చేనేత కుటుంబాలు

పుత్తూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పుత్తూరులోని కార్వేటినగరం కూడలి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మరమగ్గ కార్మికులు, నేతన్నలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. మాజీ ఎంపీపీ అమ్ములుకు స్వీట్ తినిపించి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ధనపాల్, నాయకులు గణేష్, డి.జి.ధనపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ప్రాతిపదికన వీఆర్వోలను భర్తీ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

వడమాలపేట.మార్చి 18(ఆంధ్రజ్యోతి): సచివాలయాల విలీన ప్రక్రియను స్వాగతిస్తున్నామని, అదే క్రమంలో అర్హత, సీనియార్టీ ప్రాతిపదికన వీఆర్వోలతో భర్తీ చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఏపీఆర్‌ఎస్‌ఏ పిలుపు మేరకు తహసీల్దార్ జరీనాకు వీఆర్వోలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సచివాలయాల విలీన ప్రక్రియ అనంతరం రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత, సీనియార్టీ కలిగిన వీఆర్వోలను భర్తీ చేయాలని కోరారు. విలీనం తరువాత మిగిలిన వీఆర్వోల వ్యక్తిగత అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రెవెన్యూ, ఇతర శాఖల్లో సీనియార్టీ, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో భర్తీ చేయాలని కోరారు. చక్రవర్తి, చంద్రబాబు, లోకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

సూళ్లూరుపేట, మార్చి (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని అంబేడ్కర్ గురుకులం సమీపంలో ఓ చుక్కల దుప్పి సంచరిస్తుండగా స్థానికులు గమనించారు. జనాలను చూసిన దుప్పి పరుగెత్తుకుంటూ ఓ ఫ్యాన్సీ షాప్‌లోకి వెళ్లింది. అక్కడున్న వారు వన్యప్రాణి సంరక్షణ అధికారులకు సమాచారం ఇచ్చారు. వన్యప్రాణి సంరక్షణ అధికారులు వచ్చి దుప్పిని వాహనంలో తీసుకెళ్లి అడవిలో విడిచిపెట్టారు. వేసవి కావడంతో నీటికోసం దుప్పిలు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. మూడు రోజుల క్రితం కోళ్లమిట్టలో ఓ దుప్పి ఇళ్ల మధ్య తిరుగుతుండడంతో వన్యప్రాణి సంరక్షణ అధికారులు పట్టుకెళ్లారు.


ఫ్యాన్సీ షాపులో దుప్పి

మండుతున్న సూరీడు

ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు


నిర్మానుష్యంగా ఉన్న పట్టణంలోని బాపూజీ వీధి

సూళ్లూరుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో భగభగ మండుతున్న ఎండలతో ప్రజలు సమమతమవుతున్నారు. దీనికి తోడు ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. తాజాగా మంగళవారం 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ఎండ తీవ్రతకు జనం బయటకు రావడానికి బెంబేలెత్తిపోయారు. పట్టణంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వివిధ పనులపై పట్టణానికి వచ్చినవారు దాహార్తితో అలమటిస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గత ఏడాది మార్చి నెల ఆరంభంలోనే పురపాలక సంఘ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మార్చి నెల మొదటి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంది. మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఎండవేడిమితో ప్రజలు అల్లాడిపోతున్నారు. గుక్కెడు నీళ్లు తాగుదామన్నా చలివేంద్రాలు ఎక్కడ కనిపించడం లేదని బయట ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చినవారు ఆవేదన చెందుతున్నారు. చేసేదేమి లేక నీళ్ల బాటిళ్లు కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సూళ్లూరుపేట పట్టణంలో దాదాపు 57 వేల పైబడి జనాభా ఉన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం, చెన్నైకి దగ్గరగా ఉండడమే కాకుండా వ్యాపార కూడలి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలమంది ప్రజలు నిత్యం పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే శ్రీసిటీ, అపాచి పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు ఇక్కడే నివాసం ఉంటూ విధులకు వెళ్లి వస్తుంటారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండు, షార్ బై జంక్షన్, షార్ బస్టాండు, కచ్చేరివీధి కూడలి, బాపూజీ వీధిలోని గడియారం సెంటర్, కూరగాయల మార్కెట్, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, మన్నారుపోలూరు సర్కిల్, హోలిక్రాస్ సర్కిల్, పోలీస్ స్టేషన్ సమీపంలోని కూడళ్లలో నిత్యం ప్రజలతో కిటకిటలాడుతూ ఉంటాయి. ఎండ తీవ్రత పెరిగిపోవడంతో పట్టణానికి వచ్చే ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. బస్టాప్‌లు, ప్రధాన కూడళ్లలో నిల్చోవడానికి నీడలేక ఎండలోనే అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలోని రద్దీ కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్రం

బాలాయపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. 2022లో రూ.21.8 లక్షల వ్యయంతో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం పనులు 2023లో పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ ప్రారంభించలేదు. వ్యవసాయ శాఖకు సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ సిబ్బంది కమ్యూనిటీ హాల్‌లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ భవనంలోనూ ఎంపీడీవో కార్యాలయ సామగ్రి భద్రపరచడంతో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న భవనంలో రైతు సేవా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకుని వస్తే అధికారులకు, రైతులకు సౌకర్యంగా ఉంటుంది.



రైతు భరోసా కేంద్రం

'మాలల సత్తా చాటుదాం'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల్లాంటి మాల మాదిగలను వర్గీకరణ పేరుతో విడదీయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఎంతటి ఉద్యమాలకైనా వెనకడుగువేసే ప్రసక్తే లేదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు హెచ్చరించారు. కోట బజారు సెంటర్‌లో మంగళవారం హలో మాల - ఛలో తిరుపతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల గెజిటెడ్ ఆఫీసర్ అసోషియేషన్ తిరుపతి జిల్లా చైర్మన్ యంట్రపాటి శ్రీనివాసరావు, మాల జేఎస్‌టీ చైర్మన్ తాళ్లపాక రాములు మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా మాల మాదిగలకు సంక్రమించిన హక్కులు, రిజర్వేషన్ల కోసం ఉమ్మడి పోరాటాలు చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, అశోక్ కాంబ్లే, పాలా మల్లికార్జునరావు, పనబాక హేమంత్, కేశవులు, భూపతిసాయి, కోటేశ్వరరావు, సురేష్, రాజమునీలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఓజిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకునే చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు లోనైన బోర్లకు మరమ్మతులు చేయించాలని ఊచించారు.

సొసైటీ రుణాల రికవరీపై దృష్టి

ఓజిలి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగొండ సొసైటీ పరిధిలోని రుణాల రికవరీపై దృష్టి పెట్టినట్లు సొసైటీ సీఈవో రవీంద్రబాబు అన్నారు. మంగళవారం సొసైటీ పరిధిలో గ్రామాల్లో అధికారులు పర్యటించి రుణాల రికవరీపై రైతులతో మాట్లాడారు. రైతులు సొసైటీ రుణాలను సకాలంలో చెల్లించాలని సీఈవో కోరారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని జాహ్నవిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ధనుంజయ రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధి

సూళ్లూరుపేట, మార్చి (ఆంధ్రజ్యోతి): భగవద్గీత మీద ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్యూ ఎడ్యుకేషనల్ కాంటెస్ట్ పోటీల్లో టైనీ టాట్స్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జాహ్నవి మొదటి స్థానంలో నిలిచింది. మంగళవారం జాహ్నవిని కరస్పాండెంట్ వేనాటి ధనుంజయరెడ్డి, ప్రిన్సిపాల్ శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేట్టిపాళెంకు చెందిన రాచకొండ హేమస్వరూప్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కవచ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుండు మనోజ్ కుమార్ మంగళవారం హేమస్వరూప్‌ను పరామర్శించి రూ 10వేలు ఆర్థికం సాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మునిరాజా, పల్లిపాటి సుబ్రహ్మణ్యం, బద్రి, వంశీ, రాజ్వాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిపొందని వారి నుంచి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి స్థలం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంతవరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్స్‌లో లబ్ధిపొందనివారు మాత్రమే అర్హులని తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీ ద్వారా(టిడ్కో హౌసింగ్, నవ రత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డైరీ, తనపల్లి, వికృతమాల)సొంతంగా ఇల్లు నిర్మించుకున్న వారు అనర్హులన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు సబ్‌స్టేషన్‌లో ఈనెల 20వ తేదీ గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య తెలిపారు. రిటైర్డ్ జడ్జి శ్రీనివాస అంజనేయమూర్తి, ఆర్థిక కమిటీ సభ్యులు రామమోహన్ రావు, అంజలీకుమార్, విజయలక్ష్మి, ట్రాన్స్‌కో ఈఈ నరేంద్రరెడ్డి విద్యుత్ అదాలత్‌లో పాల్గొంటారని తెలిపారు. పరిష్కారం కాని తమ సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞులు


మీడియాతో మాట్లాడుతున్న మహాజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు దూడల పెంచలయ్య తదితరులు

డక్కిలి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ నివేదికను అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాదిగ జాతి రుణపడి ఉంటుందని మాదిగ ఉద్యోగ సమాఖ్య సీనియర్ నాయకుడు, మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. మంగళవారం ఆయన డక్కిలిలో మీడియాతో మాట్లాడుతూ మాదిగ జాతి పితామహుడు మందా కృష్ణ మాదిగ ఎటువంటి పదవులు ఆశించకుండానే 30 ఏళ్లు పాటు సుదీర్ఘ పోరాట ఫలితం ఇవాల పొందుతున్నామని చెప్పారు. మాదిగలందరూ తమ ఇళ్లలో సీఎం చంద్రబాబు నాయుడు, మందా కృష్ణమాదిగ ఫొటోలను పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్ మాదిగ, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతి, సంయుక్త కార్యదర్శి గోగ్రిపాటి వీరయ్య, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అళఘునాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత అళఘునాథస్వామి

గూడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, మాడవీధి ఉత్సవం జరిగింది. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం, పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వైభవంగా జరిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మన చేతుల్లోనూ సర్వేక్షణ్ ర్యాంకు..!

- కార్పొరేషన్ నిబంధనలు పాటిస్తే చాలు
- నగరంలో పర్యటిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్ బృందం

తిరుపతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తిరుపతి నగరం సుందరంగా సిద్ధమవుతోంది. ప్రభుత్వ, నగరపాలక సంస్థ, ప్రైవేట్ ఇళ్ల గోడలపైన దేవతామూర్తుల, కళాత్మక చిత్రాలు, స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తిరుపతి, పచ్చదనం -పరిశుభ్రత నినాదాలకు సంబంధించిన పెయింటింగులతో కొత్తకళ వచ్చింది. స్కూళ్లు, పార్కులు, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, రైల్వే అండర్‌బ్రిడ్జి, ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి, రామానుజ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు నుంచి అలిపిరి వరకు, ఎమ్మార్‌పల్లి ఆర్చి నుంచి బాలాజీ కాలనీ వరకు, టౌన్‌క్లబ్ నుంచి అలిపిరి వరకు అందమైన కలంకారీ బొమ్మలు కొలువుదీరాయి. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తిరుపతిని జాతీయ స్థాయిలో నిలిపేందుకు నగరపాలక సంస్థ, ప్రభుత్వ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటిస్తోంది. మెరుగైన పారిశుధ్యం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన లేకపోవడం, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, వాటి నిర్వహణ పనితీరు, సీనియర్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్, డాక్యుమెంటేషన్స్, చెత్త సద్వినియోగం వంటి వాటిని ప్రధాన ప్రామాణికంగా తీసుకుంటారు. బృందం పరిశీలనలో ఉన్నప్పుడు అమలవుతున్న తీరుపైనే మార్కులు ఉంటాయి.

ఫోన్‌పే ట్రాన్సెక్షన్‌తో రూ.40 వేలు టోకరా

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే ట్రాన్సెక్షన్‌తో రూ.40 వేలు టోకరా వేసిన ఘటన కోట మండలంలో వెలుగు చూసింది. మండల పరిధిలోని విద్యానగర్‌లో మోహన్‌రావు అనే వ్యక్తి బ్యాంకు ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈనెల 15వ తేదీన ఓ యువకుడు వచ్చి తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, విజయవాడ నుంచి తమ వాళ్లు రూ.40వేలు మీ ఫోన్ చేస్తారని, ఆ మొత్తాన్ని నగదు రూపంలో తనకు ఇవ్వాలని కోరడంతో మోహన్‌రావు అంగీకరించాడు. వెంటనే ఆ యువకుడు ఓ మహిళకు ఫోన్ చేసి మోహన్‌రావుతో మాట్లాడించాడు. తరువాత విజయవాడకు చెందిన రమ్య అనే మహిళ రూ.40వేలు మోహన్‌రావుకు ఫోన్‌పే చేసింది. వెంటనే ఆ మొత్తాన్ని నగదుగా తీసుకున్న యువకుడు వెళ్లిపోయాడు. అదేరోజు 20 నిమిషాల తరువాత విజయవాడ నుంచి ఫోన్‌పే చేసిన రమ్య భర్త మోహన్‌రావుకు కాల్ చేసి ఫోన్‌తో మాట్లాడిన యువకుడు తమకు తెలియదని, పొరపాటున తన భార్య రూ.40వేలు ఫోన్‌పే చేసిందని, వెంటనే ఆ నగదును తిరిగి పంపాలని కోరాడు. అదేమీ తనకు తెలియదని, తనకు ఫోన్‌పే ద్వారా వచ్చిన రూ.40వేలు ఆ యువకుడు అప్పటికప్పుడే నగదు రూపంలో తీసుకువెళ్లాడని మోహన్‌రావు చెప్పారు. రమ్య దంపతులు విజయవాడలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో మోహన్‌రావుపై కేసు పెట్టడంతో అక్కడి పోలీసుల ఆదేశాల మేరకు కోట ఎస్ఐ పవన్‌కుమార్ మంగళ వారం మోహన్‌రావును విచారించారు.

అధ్వానంగా వేణుంబాక రోడ్డు


రాళ్లుతేలి గోతులు పడిన రోడ్డు

దొరవారిసత్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. జాతీయ రహదారికి లింకు రోడ్డు అయిన ఈ మార్గంలో పాలెంపాడు, గిరిజన కాలని, వేణుంబాక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రోడ్డు అడుగడుగునా గోతులమయంగా ఉంది. పాలెంపాడు నుంచి మరింత దారుణంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వేణుంబాక రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 4.8 కిలోమీటర్ల దూరం ఉన్న వేణుంబాక రోడ్డు పనులు చేసేందుకు కోటి 80 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు చేపడతామని చెప్పారు.

డిప్యూటీ సీఎంను విమర్శిస్తే సహించం: జనసేన

పెళ్లకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లాం విజయ్ అన్నారు. మండలంలోని చెంబేడులో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాయుడుపేటకు చెందిన వైసీపీ నాయకులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డికి పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. తంబిరెడ్డి డిప్యూటీ సీఎంపై మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన


సవారిగుంట, మన్నెగుంట భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వెంకటగిరి టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రభుత్వం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా స్థానిక సవారిగుంట, మన్నెగుంటలో ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటవీశాఖ భూములకు హద్దులు చూపి నివేదిక సమర్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అమ్మవారిపేట, గొట్లగుంట, చిన్నగొట్ల గుంట కన్వర్షన్ లేఅవుట్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, మండల సర్వేయర్ సుప్రజ, అటవీశాఖ డీఆర్వో విజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది రాజశేఖర్, బాలు, అజయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు చేరాలి

కోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేర్చడంతో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సంక్షేమ పథకాల తీరుతెన్నులపై పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులతో సమీక్ష జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఉద్యోగి అయినా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపి

ఆర్డీవోపై ఆగ్రహంతో
తహసీల్దార్‌ను ఘోరావ్ చేసిన దళితులు


తహసీల్దార్ ముందు బైఠాయించిన దళితులు, సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులు ఇంటి స్థలాల కోసం గత నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న విషయం విదితమే. మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి భూ కన్వర్షన్ విషయంపై బీఎన్‌కండ్రిగకు వచ్చారు. ఇంటి స్థలాల విషయం ఆర్డీవో దృష్టికి తీసుకురావడానికి దీక్ష చేపడుతున్న కొందరు దళితులు, సీపీఐ నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లాలని భావించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు చెప్పారు. ఆర్డీవో కార్యాలయానికే వస్తారని తహసీల్దార్ ఆందోళనకారులకు చెప్పారు. అయితే ఆమె కన్వర్షన్ చేయాల్సిన భూమిని పరిశీలించి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహానికి గురైన కనమనంబేడు దళితులు తహసీల్దార్ ఛాంబర్‌లో చొరబడి తహసీల్దార్ సుబ్రమణ్యంను ఘెరావ్ చేశారు. ఆర్డీవో వచ్చే వరకు కదిలేదని భీష్మించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సదరు అధికారి ఆ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్య నాయకులను తన కార్యాలయానికి రావాలని ఆమె చెప్పడంతో అక్కడి నుంచి కదిలారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నిరాజ్, కత్తి ధర్మయ్య సహా రమణయ్య, షణ్ముగం, గురువమ్మ, వీరాస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమపై పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుండడంతో సచివాలయాల ద్వారా వివిధ రకాల సర్వేలను పండుగలు, సెలవు దినాల్లో సైతం చేయాల్సి వస్తోందన్నారు. దీంతో కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం లేకపోవడమే కాకుండా అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు.కార్యదర్శులకు పంచాయతీ విధులే కేటాయించి పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెంచయ్య, శివకృష్ణ, రాజేష్, లీలాకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పన్నులు చెల్లించాలని సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు షాపుల యజమానులతో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్నులు, షాపులకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తేనే పంచాయతీ నుంచి పారిశుధ్యం కార్యక్రమాలతో పాటుగా తాగునీరు ఇతర కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. ఇంటి పన్నుల వసూళ్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్, కార్యదర్శులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం


సీఎం చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న నేతన్నలు

నారాయణవనం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమ కష్టాలను గుర్తించి విద్యుత్ చార్జీల రాయితీని ప్రకటించిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని మండలంలోని చేనేత కార్మికులు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో సీఎం చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాయితీ విద్యుత్ పథకంతో ఆర్థికంగా వెనకబడి ఉన్న తమకు భరోసా కల్పించినట్లుగా ఉందని తెలిపారు. షణ్ముగం, తిరువేంగడం, దానపరుశురామయ్య, వాసుదేవయ్య, యూనిట్ ఇన్‌చార్జిలు విజయకుమార్, బాబు, గోపి, లత, మరమగ్గ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్థశి


హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి అలయం వద్ద సంకట చతుర్థశిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతి కుటుంబం గణపతి హోమం నిర్వహించుకునే విధంగా సంకట చతుర్థశి నాడు చేసే హోమాన్ని ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం అంజంజి గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన నిర్వహించి గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై బాలికలకు శిక్షణ


బాలికలకు శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్వీయ రక్షణలో భాగంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ మాట్లాడుతూ... బాలికల్లో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం నింపడం కోసం పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ పథకంలో భాగంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. పోకిరీలు, ఆకతాయిలు నుంచి స్వీయ రక్షణ పొందడానికి కరాటే శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కరాటే మాస్టర్ కన్నయ్య ప్రతి మంగళవారం శిక్షణ ఇస్తారని తెలిపారు.

విద్యతోనే పేదరికం దూరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న 1టౌన్ పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేదరికాన్ని దూరం చేయగలమని శ్రీకాళహస్తి 1 టౌన్ సీఐ గోపి చెప్పారు. పట్టణ శివార్లలోని గిరిజన కాలనీలో సోమవారం సీఐ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య అవశ్యకతను సీఐ వివరించారు. అలాగే చెడు వ్యసనాలతో ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా ఆరోగ్యపరంగా నష్టం జరుగుతుందని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. పోలీసు శాఖ తరఫున ఏ సాయం చేయాలన్నా నెం.100కు ఫోన్ చేయడం చేయడం ద్వారా తక్షణం స్పందిస్తామని భరోసా ఇచ్చారు.

అంతరపంటలతో రైతుకు అదనపు ఆదాయం

కేవీబీపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఎక్కువమంది అంతరపంటలు వేసి అధికంగా లాభాలు సంపాదిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మామిడి, నిమ్మ తోటల్లో ఖాళీగా ఉండే స్థలాల్లో దుక్కులు దున్ని వేరుశనగ, మినుము, మిరప, ఆవాలు తదితర పంటలు వేసి లాభాలను పొందుతున్నారు.

దుస్థితిలో మినీ వైద్య కేంద్రాలు


నిరుపయోగంగా ఉన్న మినీ వైద్యకేంద్రం

కేవీబీపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మినీ వైద్య ఆరోగ్య కేంద్రం దుస్థితికి చేరుకుంది. ఎన్నో సేవలందించిన ఈ కేంద్రం చివరకు పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు ప్రతి బుధవారం, శనివారం ఈ కేంద్రంలో వైద్యాధికారి, ఏఎన్ఎంలు, ఆశాలు, ఆయాలు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందించేవారు. గత ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకోవడంతో తలుపులు, కిటికీలు దొంగలపాలైంది. గతంలో మఠం, మిద్దికండ్రిగ, రాగిగుంట, కోటమంగాపురం తదితర గ్రామాల్లో కూడా మినీ వైద్యకేంద్రాలు పని చేసేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో మినీ వైద్యకేంద్రాలన్ని దుస్థితికి చేరుకుని నిరుపయోగంగా మారిపోయాయి. ఇప్పటికైనా ఉన్నత వైద్యాధికారులు స్పందించి వీటిని పునరుద్ధరించి ప్రజలకు సేవలందించాలని మండల వాసులు కోరుతున్నారు.

మోహన్‌సాయి కుటుంబాన్ని ఆదుకోండి
మంత్రికి ఎమ్మెల్యే వినతి


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెనస్సీలో దుండగుడి కాల్పుల్లో గాయపడ్డ పోతుగుంట మోహన్‌సాయి కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే సుధీర్ కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. దీనిపై మంత్రి సాను కూలంగా స్పందించి మోహన్‌సాయికి సహాయ సహకారాలు అందించాలని అధికారులను కోరారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

వరదయ్యపాళెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ మహిళలు అర్హులన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల్లోపు ఉండి, తెల్లరేషన్‌కార్డు, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 45 రోజుల కాలవ్యవధిలో రోజుకు 8గంటల శిక్షణ, 60 రోజుల కాలవ్యవధిలో రోజుకు 6గంటల శిక్షణ, 90 రోజుల కాల వ్యవధిలో రోజుకు 4గవంటల పాటు శిక్షణ ఇస్తారన్నారు. అర్హులైన వారు సంబంధిత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశువుల్లో లింగ నిర్ధరణపై అవగాహన

రేణిగుంట, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): పశువుల్లో లింగ నిర్ధరణ వీర్యంపై రాస్ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం జరిగాయి. మండల ంలోని ఎస్‌యూపురంలో ఎంపిక చేసిన పశువుల కృతిమ గర్భధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ హెడ్ శ్రీనివాసులు, పశు వైద్య డాక్టర్ అనూష మాట్లాడుతూ... పెయ్య దూడలు పుట్టుక సంఖ్య తగ్గిపోతుండడంతో లింగ నిర్ధరణ వీర్యం వినియోగించి వాటి సంఖ్యని పెంచుతున్నారన్నారు. చూడి పశువులలో తీసుకోవాల్సిన జాగత్తలు, పొదుగు వాపు నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాస్ శాస్త్రవేత్త దివ్య సుధ, బీబీవీ ప్రాజెక్టు డైరెక్టర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

పిచ్చాటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి, రజానగరం లలో మంగళవారం వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పొలంబడి జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... వరి కోతలు, వేరుశనగ ఒబ్బిడి దశలో ఉండడంతో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కూలీలు సకాలంలో దొరకని రైతులు యంత్రాలతో వరి కోతలు, వేరుశనగ నూర్పిడి చేసుకోవాలని సూచించారు. రైతులు ఉద్యానవన పంటలతో పాటు కాయగూరల సాగుపై చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి 1టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి వివరాల కోసం ఆరా తీశారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆ స్పత్రికి తరలించారు.

పేదరిక నిర్మూలనకే పీ4 సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకే పీ4 సర్వే చేపడుతున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మంగవారం ఐదు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో పేదవారు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గంలో సర్వే చేపడుతున్నారన్నారు. పురపాలక సంఘ అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు గోపి, వజ్రం కిషోర్, నారాయణ, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు. ఇక అదే విధంగా టీడీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని పూసలవీధిలో పీ4సర్వే బ్యానర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు పీ4సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, సుబ్బయ్య, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, బీమాల బాస్కర్, మణి, సునీల్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, రమేష్, శేఖర్, సులేమాన్, రఫీ, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న దృశ్యం

రేణిగుంట, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు మంగళవారం ఉదయం కూల్చి వేశారు. పాత విమానాశ్రయం రోడ్డులోని కొత్తపాళెం సర్వే నెం.100/1లో నిర్మించిన ఇల్లును ఆర్‌ఐ జయకృష్ణ, వీఆర్వో శంకర్ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చి వేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో ఎల్లమండ్యానికి చెందిన ఓ వైసీపీ నాయకుడికి రూ.3 లక్షలు ఇచ్చి స్థలాన్ని కొను గోలు చేసి ఇల్లు నిర్మించుకున్నామని చెప్పారు. ఈ విషయమై వైసీపీ నాయకుడిని న్యాయం చేయాలని కోరగా డబ్బు ఎవరికిచ్చారో వారినే అడగమని చెబుతున్నాడంటూ వాపోయారు. తమ ఇల్లే ఎందుకు కూల్చుతున్నారని, ఇక్కడ చాలా ఇళ్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి


పోలయ్య(ఫైల్)

శ్రీకాళహస్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు కర్మాగారంలో పనిచేసే కార్మికుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ పంచాయతీ కొత్తపాళెం మిట్టదళితవాడకు చెందిన పోలయ్య(41) ఇదే మండలంలోని రాచగున్నేరి వద్ద ఉన్న ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై కర్మాగారానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో తొండమనాడు వద్ద లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో పోలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో భార్య భారతి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుంది. 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మూడు వాహనాలు ఢీకొని ప్రయాణికులకు స్వల్ప గాయాలు

రేణిగుంట, మార్చి 18, (ఆంధ్రజ్యోతి) : మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం గుత్తివారిపల్లి సర్వీసు రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. గుత్తివారిపల్లికి నేషనల్ హైవే వంతెనకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించారు. దీంతో వంతెన కింద ఎడమ పక్క సర్వీస్ రోడ్డు మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మధ్యాహ్నం 1 గంటకు ప్రయాణికులతో వెళుతున్న ఆటోను కారు ఢీకొనింది. ఆ కారు వెనుక వస్తున్న మరో రెండు కార్లు ఢీకొన్నాయి. ఆటో ప్రయాణిస్తున్న ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. సర్వీసు రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు సరిగ్గా కనపడకపోవడంతో పాటూ అసంపూర్తి నిర్మాణాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

దళితుల భూములు కబ్జా చేస్తున్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): దళితుల భూములు కబ్జా చేస్తున్న రైల్వే పోలీసు అధికారి ఆశీర్వాదంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం, సీపీఐ, రిపబ్లికన్ పార్టీల నేతలు నాగరాజు, కందారపు మురళి, అంజయ్య, గోవిందయ్య కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విజ్ఞప్తిచేశారు. మంగళవారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకాల మండలం కుక్కలపల్లి దళిత గ్రామంలో ఆశీర్వాదం తన కుటుంబ సభ్యులు, రౌడీలతో కలిసి దళితుల భూముల్లో అక్రమంగా ప్రవేశిస్తున్నాడని పేర్కొన్నారు. దళితుల డీకేటీ భూములు అక్రమంగా కొనుగోలు చేశాడని అంతేగాక ఇతరుల భూముల్లోకి దారి ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడని తెలియజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

శెట్టిపల్లి భూముల సమస్యలపై...

ఏప్రిల్ 15వ తేదీ లోపు శెట్టిపల్లె లబ్ధిదారులకు స్థలాలు చూపెడుతామని అన్ని అనుమతులు పొందిన తరువాత అధికారిక పత్రాలు అందజేస్తామని కలెక్టర్ నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గోవిందస్వామి, శెట్టిపల్లి భూ పోరాట కమిటీ నాయకులు కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూమిని కబ్జా చేసి అమ్మకానికి పెట్టారు'

రేణిగుంట, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): ఏర్పేడుకు చెందిన తెలుగుమహిళా నాయకురాలు తమ భూమిని కబ్జా చేసి అమ్మకానికి పెట్టిందని, ఎమ్మెల్యే సుధీర్ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు జీవన, శాంతికుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పేడు సర్వే నెం.193/4లో 2 సెంట్ల భూమి తమ పూర్వీకులు కొనుగోలు చేశారని, ఆ భూమిని తెలుగుమహిళ నాయకురాలు కబ్జా చేసి విక్రయానికి పెట్టిందన్నారు. ఈ విషయమై తాము ఇప్పటికే ఎమ్మెల్యేని కలిసి వివరించామన్నారు. అయినా ఆ స్థలాన్ని విక్రయించేందుకు యత్నిస్తున్నారని వెంటనే ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ భార్గవిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టర్ సమీక్ష


విమానాశ్రయంలో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తిరుమల పర్యటనలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో సీఎం తిరుపతిలో ఉంటారన్నారు. ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రతాపరంగా పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.

రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వాహనాలను ఎక్కడబడితే అక్కడ నిలపడం కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. దీనిపై వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. మెయిన్ రోడ్డులో అడ్డదిడ్డంగా వాహనాలను పెట్టడం వలన దుకాణదారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే ఆటోలు పెట్టుకోవాలన్నారు. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.